Regd.No. TRP / 123 / 2018 - 20 August 2018 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-07-2018, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము

భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీ శుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి వస్వములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

వేదాంతభేరి

ఆగస్టు 2018 రూ. 10/-

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము:51 ఆగష్టు 2018 సంచిక: 08

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 51 ఆగష్టు 2018 సంచిక : 08

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02.సంయమము -శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06

03. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 11

04. రాజయోగం - ఆరు పాఠాలు - శ్రీ స్వామి వివేకానంద - 13

05. భాగవత సుధ - శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు - 18

06. శ్రీరామకృష్ణ కథామృతం - శ్రీ రామకృష్ణ పరమహంస - 24

07.ఓమిత్యే కాక్షరం బ్రహ్మ-శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 25

08. శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 10

జంతుబలి నివారణ - డా॥సముద్రాల లక్ష్మణయ్య - 30

09. భారతావని - శ్రీ అరవిందులు - 32

10. నాస్త్యన్తో విస్తరస్య మే - ఆచార్య కె.సర్వోత్తమరావు - 40

11. వార్తలు - 42

ముఖచిత్రం

శ్రీ విఖనస మహర్షి (విఖనసాచార్యులు)

జూలై 28తేది విఖనసాచార్యుల జయన్తి.

ఆగష్టు 15వ తేది శ్రీ అరవిందయోగి జయన్తి.

ఆగష్టు 28వ తేది శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన.

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. పావకా నః సరస్వతీ వాజేభి ర్వాజినీ వతీ ।
యజ్ఞం వష్టు ధియా వసుః ॥ (ఋగ్వేదం 1-1-9-10)

2. మత్స్వా సుశిప్ర మందిభిస్తోమేభి ర్విశ్వ చర్షణే ।
స చైషు సవనేష్వా ॥ (ఋగ్వేదం 1-3-9-3)

3. అసృగ్రమింద్ర తే గిరః ప్రతి త్వాముదహాసత ।
అజోషా వృషభం పతిమ్ ॥ (ఋ-1-3-9-4)

4. సంచోదయ చిత్రమర్వాగ్రాధ ఇంద్ర వరేణ్యమ్ ।
అసదిత్తే విభు ప్రభు ॥

5. తమీశానం గత స్తసుషస్పతిం ధియం జిన్వమవసే హూమహే వయమ్।
పూషానో యథా వేదసా మసద్వృధే రక్షితా పాయు
రదబ్ధః స్వస్తయే ॥ (ఋగ్వేదం 1-6-15-5)

1. తా ॥ ఓ వాక్పతీ! సర్వవిద్యామయా ! నీ కృపవలన మాకు సకల శాస్త్ర విజ్ఞానంతో కూడిన సరస్వతి లభించుగాక! ఉత్కృష్టములైన అన్నాదులతోబాటు సర్వోత్తమ క్రియా విజ్ఞానంతో కూడినది, పవిత్ర స్వరూపం గలది, మంగళకారిణి యగు వాణి నీ ప్రేరణచే లభించుగాక ! నీ యనుగ్రహంతో పరమోత్తమ బుద్ధితో కూడిన ఈ వాణి సకల శాస్త్ర బోధ కలిగినదియు, పూజనీయుడవగు నీ యొక్క విజ్ఞానమును సదా కోరునదియగుగాక! దీనిచే మా మూర్ఖత నశించి మేము పాండిత్యం గలవారము అగుదుము గాక!

2. సర్వ జగద్ద్రష్టవు, శ్రేష్ఠ జ్ఞానవంతుడవగు ఓ భగవంతుడా! నీవు వేదోక్త స్తోత్రాలచే స్తుతింపబడి మాకు సకలైశ్వర్యముల నిచ్చి మమ్ము బాగుగా ఆనందపఱచుము.

3. ఓ పరమేశ్వరా ! ఏ నీ వేదవాక్కులు సర్వోత్తముడవైన, సర్వ పాలకుడవైన నిన్ను తెలియజెప్పినవో ఆ వేద వాక్కులతోనే నేను నిన్ను వరిస్తున్నాను.

4. కరుణామయా! సర్వసుఖప్రదాతా! ఇంద్రా! నీ సృష్టిలో అతి శ్రేష్ఠములు, పూర్ణములు, ఉత్తమ ప్రభావ హేతువులగు అద్భుత పదార్థాలేవి గలవో వానినన్నింటిని, సర్వ సుఖప్రదమగు ధనమును మాకు కలుగజేయుము.

5. ఓ స్వామి! నీవే చరాచర జగత్తు కంతటికి ఈశానుడవు, సృష్టికర్తవు. సర్వవిద్యామయము, విజ్ఞాన స్వరూపమగు బుద్ధిని ప్రకాశింపజేయువాడవు. అందఱికి పోషకుడవు. అట్టి నిన్ను మా రక్షణకై ఆహ్వానిస్తున్నాము. నీవు మా సుఖశాన్తులకై సదా రక్షకుడవు కమ్ము.

సంయమము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పశుపతిగా జీవించదలంచుకొని బ్రహ్మానందమును అనుభవించ దలంచువారికి ఇంద్రియ నిగ్రహము, సంయమము చాలా అవసరము. సంయమమనగా నిగ్రహము. మనస్సు ఇష్టము వచ్చినట్లు పరుగెత్తి పోవుచున్నపుడు పగ్గముతో గుఱ్ఱమును లాగిపట్టినట్లు వివేకము చేతను, వైరాగ్యము చేతను దానిని లాగి పట్టి యథాస్థానమందుంచుటయే సంయమము. పరమార్థ జీవితము సంయమముతోనే ప్రారంభించును. సంయమము లేని జీవితము పశు జీవితమే కాగలదు. సంయమమును లెస్సగా అభ్యసించి మనస్సును దృశ్య విషయములపైకి ఇష్టమువచ్చినట్లు పోనీయక ఆత్మయందు స్థాపించినచో జీవునకు పరమశాంతి లభించి మానవుడు మాధవుడుగా శోభిల్లును. పశువు పశుపతి (ఈశ్వరుడుగా)గా మారిపోవును. ఇదియే జీవిత పరమావధి.

జంతువులకుగాని, పశుపక్ష్యాదులకుగాని, తదితర ప్రాణికోట్లకుగాని పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలవఱకు అట్లే ఉండును. మార్పు ఏమియూ ఉండదు. సింహము క్రూరముగా పుట్టి క్రూరముగా చనిపోవును. ఎలుకలను చంపు పిల్లి గుణము అంత్యకాలము వఱకు ఏ మార్పున్ను లేక యుండును. కాని మానవుడట్లు కాదు. పుట్టుకతో వచ్చిన మలిన సంస్కారమును దురలవాట్లను పెద్దల సహవాసము చేతను, మహనీయులగు సద్గురువుల యొక్క సాంగత్య సాహచర్యముల చేతను, తనయొక్క తీవ్రతర అనుష్ఠానము చేతను మార్చుకొని సన్మార్గమన ప్రవర్తించగలడు, జంతువులకును మానవులకును భేదమిచటనే కలదు. మానవుని మెదడులో బ్రహ్మావలోక

ధిషణత్వమను, అపూర్వ శక్తిని భగవానుడు ఏర్పాటు చేసెను. దానిని సద్వినియోగపరచుకొనుటలోనే మానవుని మానవత్వము ఇమిడియున్నది.

కాని అందఱు మానవులు ఆ ప్రకారము చేయుచున్నారా? లేదు. మాయా ప్రవాహమున చాలమంది కొట్టుకొని పోవుచున్నారే కాని ఎదురీది ఒడ్డు చేరువారు బహు అరుదు. మాయను, ప్రకృతిని జయించుటకు కొందరు అసలు ప్రయత్నమే సలుపరు. వీరు అధములు. వీరు దుర్గతినే పొందుదురు. కొందరు ప్రయత్నము ప్రారంభించి మధ్యలో విరమించుదురు. వీరు మధ్యములు. వీరికి ప్రయత్నానుసారము ఎపుడైన సద్గతి కలుగవచ్చును. మఱికొందరు ఎన్ని ఆటంకములు సంప్రాప్తించినను తమ ప్రయత్నము విడనాడరు. వీరు ఉత్తములు. వీరికి సద్గతియే లభించును.

కాబట్టి ఉత్తములవగిది మానవుడు తన జన్మ లక్ష్యమగు ఆత్మసాక్షాత్కారమను పరమావధిని గుర్తెఱింగి, అందులకు అత్యావశ్యకమైనట్టి మనస్సంయమమును అలవాటు చేసికొనవలెను. సామాన్యముగ మనస్సు తనకు మిక్కిలి ఇష్టమైన ప్రపంచ పదార్థముపైననే వాలుచుండును. సంయమము అభ్యసింప గోరువాడు దానిపై వాలకుండ మనస్సును ప్రత్యాహార మొనర్పవలెను. దానికంటె మించిన వస్తువు ఆత్మయనియు, విషయ సుఖముకంటె ఎన్నియోరెట్లు మించిన సుఖము ఆత్మయందు కలదనియు మనస్సునకు నచ్చ చెప్పి దానిని వెనుకకు మరలించి ఆత్మయందు స్థాపించవలెను.

యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్

తతస్తతో నియమ్యైత దాత్మన్యేవ వశం నయేత్

అను శ్లోకమునందు గీతాచార్యుడీ తత్త్వమునే ప్రస్ఫుటమొనర్చెను. వసిష్ఠ మహర్షియు శ్రీరామచంద్రునకు ఈ ప్రకారమే మనోనిగ్రహము గూర్చి విపులముగ బోధించి యుండెను.

యత్రాభిలాష స్తన్మ్నానం సంత్యజ్య స్థీయతే యది

ప్రాప్త ఏవాఙ్గ తన్మోక్షః కిమేతావతి దుష్కరమ్.

'ఓ రామచంద్రా ! మనస్సునకు ఏ ప్రాపంచిక పదార్థము పైన ఎక్కువ అభిలాషకలదో, ఆ పదార్థము అనుభవించకుండ వదలివేసినచో అపుడు మనస్సు క్రమక్రమముగా స్తిమితపడి నిశ్చలత్వమును పొందగలదు. అట్టి నిశ్చల మనఃస్థితియే మోక్షము. కాబట్టి ఇంతమాత్రపు కార్యమునందేమి ప్రయాస కలదు?

మన స్సంయమమునుగూర్చి మహర్షులు సూచించిన ఈ పద్ధతుల కనుగుణముగ మన పూర్వీకులు కొన్ని ఆచారముల నేర్పరచిరి. గయా క్షేత్రమున కెవరైన యాత్రార్థము వెడలినపుడు వారి కిష్టమైన పదార్థమును అచట వదిలివేసి మరల దానిని జీవితమునందెవుడును అనుభవించకయే యుందురు. కొందఱు తమకిష్టమైన కూరను అచట వదిలిపెట్టి యావజ్జీవితము దానిని తాకకయే యుందురు. మఱికొందఱు తమకిష్టమైన పండును వదలివేయుదురు. ఈ యాచారము లన్నిటియొక్క ఉద్దేశ్యము మనోనిగ్రహమే, మన స్సంయమమే. ఏదియో విధముగ మనస్సును విషయములపైకి పోనీయక అదుపు ఆజ్ఞలలో నుంచుటయే పెద్దలయొక్క అభిప్రాయము.

సంయమము లేని జీవితము జీవితమే కాదు. రాతికి సంయమన శక్తి లేదు. పశువునకు సంయమన శక్తి లేదు. అన్ని హంగులతో గూడిన మానవుడు కూడ ఆ ప్రకారము సంయమరహితుడై వ్యవహరించినచో జన్మ నిరర్థకమై పోగలదు. కాబట్టి మోక్షకాంక్షియగు ప్రతి మానవుడును తనకు భగవంతుడు ప్రసాదించిన శక్తిసామర్థ్యములను సదుపయోగ పఱచుకొని, సంయమమును లెస్సగ శీలించి, మనోవిలయముచే పరమానంద మనుభవించవలెను.

సంయమమే జీవితమునకు శోభ. సంయమము లేని జీవితము సుజీవితమే కాజాలదు. మానవుని మానవత్వము సంయమముచే చక్కగా ప్రకాశించగలదు. వెయ్యేల, మానవత్వమునకు కొలబద్ధ సంయమమేనని నొక్కి చెప్పవచ్చును. ఏలయనగా ఇంద్రియములు చెప్పినట్లు అడునది పశువు. పుట్టుకతో ఏ సంస్కారములు అది కలిగి యుండునో, పుడకల వఱకు అవియే కొనసాగుచుండును. ఏ మాత్రము మార్పు ఉండదు. మార్పు కలుగజేసికొనుడు అని బోధించినను అర్థము చేసికొనగలుగు తాహతు వాటికి లేదు. కనుకనే పశు జీవితము చాల ఘోరమైనదని, బాధా కరమైనదని,జ్ఞానశూన్యమైనదని పెద్దలు చెప్పుదురు. దృష్టాంతమునకు ఒక పిల్లిని తీసికొనివచ్చి, కూర్చొనబెట్టి ఓ పిల్లిగారూ! ఎలుకలను చంపవద్దు ' అహింసా పరమోధర్మః ' అని సావకాశముగ బోధించినచో అది వినునా? ఒక సంవత్సరము వరుసగ బోధించినను, ఆ వెనుక మరల అది పాత సంస్కారమునకు అనుగుణ్యముగనే ఆచరించుచుండును. మారదు. మార్పుకలుగజేసికొనవలెనను ఊహయే దానికి జనింపదు. పశు స్వభావమనగా ఇదియే.

కాని మానవుడు అట్లు కాదు. జన్మతః వచ్చిన చెడ్డ సంస్కారము లను తన ప్రయత్నములచేతను,పెద్దల సాంగత్య, బోధలచేతను మార్పు చేసికొనగలడు. పశువుగా జన్మించిన వాడు పశుపతిగా మారగలడు. అట్లు మారినవారు చరిత్రలో కొల్లలుగానున్నారు. జీవుడు శివుడై, మానవుడు మాధవుడై పరిఢవిల్లిన సందర్భముల నెన్నియో చరిత్ర చూపు చున్నది. దీని కంతటికిని కారణము సంయమమే. మనస్సును, ఇంద్రియములను ఇష్టం వచ్చినట్లు పోనీయక, కళ్ళెము పట్టి గుఱ్ఱమును లాగిన చందమున అదుపులో నుంచగల్గుటయే మానవుని గొప్పతనమునకు నిదర్శనము. వసిష్ఠులవారి ఈ క్రింది బోధ ఎంత మహత్తరముగ నున్నదో చూడుడు.

మనాగపి విచారేణ చేతసః స్వస్య నిగ్రహః

మనాగపి కృతోయేన తేనాప్తం జన్మనః ఫలమ్.

ఎవడు ఒకింత తత్త్వవిచారణచే మనస్సును కొంచెము నిగ్రహించి నప్పటికిని అతడు మనుష్య జన్మ ఎత్తినందులకు ఒక గొప్ప ఫలితమును బొందినట్లే కాగలదు. అతని మానవ జన్మ సఫలమైనట్లే కాగలదు. ఆహా! వసిష్ఠ మహర్షి సంయమమున కెంతటి ప్రాధాన్యత నొసంగెనో చూడుడు. కనుకనే ఉపనిషత్తులు, భగవద్గీత, భారత,భాగవత, రామాయణాది శాస్త్రములు సంయమము అతి ముఖ్యమైనదనియు, అది లేని జీవితము వ్యర్థ జీవితమే కాగలదనియు వేనోళ్ళ ఘోషించుచున్నవి.

'యోగస్య ప్రథమంద్వారం వాఙ్నిరోధః '

అని శ్రీ శంకరభగత్పాదులు పేర్కొనినట్లు వాక్కు మొదలైన ఇంద్రియములను నిగ్రహించుటయే యోగమను భవనమునకు ముఖ్య ద్వారమని, అనగా లోన ప్రవేశించుటకు ప్రథమ ద్వారమని స్పష్టమగుచున్నది. యోగమనగా కలయిక, జీవ బ్రహ్మైక్యము. అట్టి దానికి మొదటి మెట్టు సంయమమేయని భగవత్పాదులు తేటతెల్లముగ తెలిపియున్నారు.

గృహ వైద్యము

1. రోజూ మూడుసార్లు పూటకు 1-2 చిటికెల మిరియాల పొడిని 50 లేక -100 మి.లీ వేడిపాలలో కలిపి తీసుకొంటే దగ్గు, శ్లేష్మం, గొంతు మూసుకుపోవడం తగ్గిపోతుంది.

2. అర టీ స్పూను మిరియాల పొడి, సగం చిన్న నీరు ఉల్లిగడ్డ కలిపి మెత్తగా నూరి తేలు, జెర్రికాటుపై పట్టిస్తే, పది మిరియాలను రెండు తమలపాకులతో కలిపి నమిలి మింగితే విషం పోతుంది.

సద్గురు బోధ

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

చిల్లులుగల కుండలో నీరుపోసిన నిలువనట్లు భక్తి, జ్ఞాన, వైరాగ్యేన్ద్రియనిగ్రహములు లేని యోగము యోగికి సిద్ధిని గలుగజేయ జాలదు. అట్లుగాక ఇన్ద్రియ నిగ్రహము, బ్రహ్మచర్యము, ధ్యానాదులుగల్గి యోగములు సల్పెనేని ఆ యోగ మంతకంతకభివృద్ధియై భోగాదులందు విరసత్వము జనింప త్వరలో జీవుడు పరబ్రహ్మైక్యము నొందగలడు.

* * * * * *

భూమియందు బీజమునుంచి ఒక పర్యాయము నీరుపోసి మఱల ఎన్నడు పోయకున్న అది మొలక మొలచినను చెమ్మలేనందుచే మొలక వృద్ధినొందక వేరు ఎండి నశించిపోవును. అదేరీతిగా గురు సన్నిధిజేరి మంత్రోపదేశమొందినను, ధ్యానానుష్ఠానాది సాధనలు లేనిచో జ్ఞానాభివృద్ధి కానేరదు. కావున సాధకుడు కడుజాగరూకుడై యుక్తాహారము, వివిక్తవాసము, బ్రహ్మచింతన సల్పుచు ముక్తిని సాధింపవలెను.

* * * * * *

బంగారు పాత్రలో ఆమ్లరసముంచిన చిలుమెక్కదు కానీ రాగి పాత్రలో యుంచిన వెంటనే చిలుము పట్టును. అట్లే కామాది వృత్తులు నశింపనివాని హృదయములో జ్ఞానమును ప్రవేశపెట్టిన అది నిలువదు.

* * * * * *

దీపము శుద్ధమైన గ్లాసునందు వెలుగుచున్నను, వత్తి పెద్దదైన మసిబట్టి ఎట్లు మలినమగునో, అట్లే ఎట్టి జ్ఞానియైనను స్వల్పమాత్రమగు అంతఃకరణ దోషముండిన క్రమముగ అది పెరిగి తుదకు వాని నధోగతి పాలొనర్చును.

* * * * * *

ఆహార నియమమును చాల జాగ్రత్తగ పాటించు చుండవలయును. నియమము తప్పి అపుడపుడు మధ్య మధ్య తినుచుండుటచే ఆరోగ్యము చెడుటయే గాక ఇన్ద్రియములున్ను వశపడనేరవు.

ఎలుక కఱచినచో ఆ విష మెంత కొంచె ముండినను క్రమముగ నది వృద్ధియై అతనిని వ్యాధిగ్రస్తునిచేసి చంపును. ఆ రీతిగనే అంతఃకరణమునందు కొంచెమేని దోషముండినచో అది అంతకంతకు ప్రబలి జీవుని యధోగతికి తెచ్చును. కావున అంతఃకరణ శుద్ధికై విశేషముగ ప్రయత్నము చేయవలెను.

* * * * * *

గుహ్యేన్ద్రియము, జిహ్వేన్ద్రియము నిగ్రహింపబడనంత వఱకు బ్రహ్మరన్ధ్రము – మోక్షద్వారము మూయబడియే యుండును. జిహ్వోపస్థల నిగ్రహము గలవారికే అది తెరువబడును.

* * * * * *

ఎట్టి యనుష్ఠానము గలవాడైనను విషయసాంగత్యము, దుష్ట సంపర్కము గల్గియున్నచో క్రమముగ వానిదృష్టి ప్రపంచమువైపు మఱలి, ఆత్మనిష్ఠ తగ్గి, బ్రహ్మచర్యము పతనమై, ఊర్ధ్వరేతస్కుడగుట మాని, యధోగతుడై చిత్తచాంచల్యము గల్గి కర్మబ్రహ్మోభయ భ్రష్టుడగును, గాన విషయ సాంగత్యము, దుష్ట సంపర్కము ఏమాత్రం పనికిరావు.

* * * * * *

భక్తియను తైలమున్నను, వైరాగ్యమను ప్రమిదకు రంధ్రమున్నచో ఆ భక్తిరూప తైలమంతయు క్రమముగ కారిపోయి జ్ఞాన జ్యోతి వెలుగ కుండును. ఒక రంధ్రమున్నపుడే తైలము కారిపోవ, పది రంధ్రము లున్నచో వేఱుగ చెప్పవలయునా? అట్లే యే యొక్క ఇన్ద్రియమైనను విషయములందు చరించుచున్నచో తద్ద్వారా జ్ఞానమంతయు హరించిపోవ, దశేన్ద్రియములు విషయోన్ముఖములైనచో జ్ఞానము నశించునని వేఱుగ చెప్పనేల?

* * * * * *

టెంకాయలో నీళ్లుండువఱకు అది కురిడీ కాజాలదు. కొబ్బరి చిప్ప నంటుకొనియే యుండును. అట్లే దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన యను నీ వాసనాత్రయము హృదయమున నుండువఱకు జీవుడు బంధరహితుడై జీవన్ముక్తుడు కాజాలడు. ఎపుడా వాసనలు నశించునో అపుడే చిప్పనుండి కురిడీ వేరుపడినట్లు జీవుడు ప్రకృతి నుండి వేరుపడి బంధవిముక్తుడై ఆత్మస్వాతంత్ర్యము ననుభవించును.

రాజయోగం - ఆరు పాఠాలు

- శ్రీ స్వామి వివేకానంద

యోగానికి అష్టాంగాలున్నాయి.యమం-నియమం- ప్రాణాయామం - ప్రత్యాహారం-ధారణం-ధ్యానం-సమాధులు.

1.యమం: ఇది చాలా ముఖ్యమైంది. జీవితాంతం దీన్ని పాటించాల్సి ఉంటుంది. ఇది ఐదు భాగాలు. అహింస-అస్తేయం -శౌచం-సత్యం -అపరిగ్రహం. త్రికరణశుద్ధిగా వీటిని పాటించుటయే యమం.

2.నియమం: ఇది శారీరకం. స్నాన అన్నపానాలకు సంబంధించింది.

3. ఆసనం : పిరుదులు-భుజాలు-తల నిటారుగా నిలిపి వెన్నుబద్ద వంగకుండా కూర్చోవటం.

4.ప్రాణాయామం: వాయు నిరోధం. దీనివల్ల ప్రాణశక్తి నిరుద్దమౌతుంది.

5. ప్రత్యాహారం: మనసును బయటికి వెళ్లకుండా నిరోధించి, దాన్ని అంతర్గతంలోకి వెళ్లేలా చేయటం. ధ్యేయాన్ని మాత్రమే మనసులో మరల మరల అనుసంధానం చేయటం.

6. ధారణ: ధ్యేయంలో మనసును కేంద్రీకరించటం.

7. ధ్యానం: ఈ దశలో ధ్యేయమే ఏకధారగా ప్రవహిస్తుంది.

8. సమాధి: ఆత్మదర్శనం. ఇదే మన సర్వ ప్రయత్నాలకు చరమదశ.

యమ నియమాలు జీవితాంతం అభ్యసించాలి. మిగతావి నిచ్చెన మెట్లు. వాటిని ఒకదాని తర్వాత మరొకటి వరుసగా తృణజలూక న్యాయంగా అనుసరించాలి. మొదటిదాన్ని బాగా అభ్యాసం చేసిన తర్వాతే పై మెట్టును గ్రహించాలి.

ఈ పాఠంలో ప్రాణ నిరోధం గూర్చి చెబుతాను. రాజయోగంలో ప్రాణవాయువు సూక్ష్మశరీరంలో ప్రవేశించి, ఆధ్యాత్మికానుభూతిని కలిగిస్తుంది. ప్రాణాయామం మొత్తం శరీరానికంతా దీపక సాధనం. అది ముందుగా ఊపిరితిత్తులకు బలమిస్తుంది. అది ఊపిరితిత్తులు -హృదయం- రక్తప్రసారం- మేధ-మనసు వీటన్నింటిపై పనిచేస్తుంది. బుద్ధి బాహ్య జ్ఞానాన్ని కలిగిస్తే, ఆ బాహ్యజ్ఞానం మరల బుద్ధిని ప్రదీప్తం చేస్తుంది. మన ఇచ్ఛాశక్తులు బలహీనమైనవి. ఆ శక్తులను మనం సరిగ్గా గుర్తింపలేకున్నాం. మనం భౌతిక జగత్తులో అంతలోతుగా దిగిపోయాం. మనకున్నదంతా బాహ్యప్రవృత్తే. బాహ్యజగత్తు మన మనశ్శాంతిని పాడు చేస్తుంది. మనం బాహ్యజగత్తును వశంలోకి తేజాలకున్నాం. ఇదంతా తప్పు. నిజంగా ఎక్కువ బలవంతమైన శక్తి మనలోనే ఉంది.

లోకంలో మహానుభావులైన ఆచార్య పురుషులు, సిద్ధులు, తమ మనసులను జయించి ఆత్మశక్తితో దివ్య సందేశాన్ని వినిపించారు.

ఒక రాజు తన మంత్రిని ఒక ఎత్తైన బురుజులో పెట్టి బంధించాడు. ఆ మంత్రి భార్య ఒక పోకచెక్క - తేనె -పట్టుదారం -నూలుత్రాడు-త్రాోకును అందించగా, ఖైదులోనుండి అతను తప్పించుకుని బయట పడతాడు. ఈ కథ మనసును ఎలా అదుపులోకి తేవాలో తెలుపుతుంది. ప్రాణాయామం పట్టుదారం లాంటిది. ఈ ప్రాణాయామం వల్ల ఒకదాని తర్వాత ఒకటి మనశ్శక్తులను

వేదాన్తభే... చం...
మురళీధర కృష్ణుడు

అదుపులోకి తెచ్చుకోవచ్చు. చిట్టచివరిదైన ధ్యానం పెద్ద మ్రోకు లాంటిది. దాంతో మనం ఈ శరీర బంధిఖానానుండి బయటపడతాం. ముక్తులమైన తర్వాత మోక్షసాధనాలను అవతలికి పారవేయవచ్చు.

ప్రాణాయామంలో మూడు భాగాలున్నాయి. పూరకం- కుంభకం- రేచకం.

పూరకం: గాలిని లోనికి పీల్చుట, కుంభకం: గాలిని నిలుపుట,

రేచకం : గాలిని బయటికి వదులుట.

మెదడు నుండి వెన్నుబద్ద వెంట, రెండువైపులా మూలాధారం వరకు వచ్చి, అక్కడినుండి మరల రెండవ వైపునుండి ఒకదాని నొకటి దాటి మరల వెన్నుబద్ద వెంట చేరే రెండు నాడులున్నాయి. ఆ రెంటిలో ఒకటి పింగళనాడి. ఇది మెదడులో ఎడమ ప్రక్క నుండి బయలుదేరుతుంది. వెన్నుబద్ద కుడిప్రక్కకు తిరిగి మరల ఎడమ ప్రక్కకు తిరుగుతుంది. దీని ఆకారం ఇంగ్లీషు అంకె ఎనిమిది (8)లో సగం ఆకృతిగా (S) ఉంటుంది.

రెండవనాడి ఇడ. ఇది పింగళనాడికి ఎదురు చుట్టుకుని ఎనిమిది(8) అంకె పూర్ణాకృతిని సిద్ధింప చేస్తుంది. ఈ ఎనిమిదంకెలో పైభాగం కన్నా క్రింది భాగం పొడవెక్కువ. ఈ రెండు నాడుల్లో ప్రాణశక్తి దివారాత్రాలు ప్రవహిస్తూ షట్చక్రస్థానాల్లో ప్రాణశక్తిని నిల్వచేస్తూ ఉంటుంది. అయితే మనకీ చక్రాలు తెలియవు. ధ్యానం వల్ల మాత్రమే వాటిని మనం చూడగలం. ఇడా పింగళ ప్రవాహాలు మన శ్వాసక్రియతో సంబంధం కలిగి వున్నాయి. కాబట్టి ప్రాణాయామం వల్ల శరీరాన్ని మనం స్వాధీనం చేసుకోగలం.

కఠోపనిషత్తులో శరీరాన్ని రథంగా, మనసును పగ్గాలుగా, బుద్ధిని

సారథిగా, ఇంద్రియాలను అశ్వాలుగా, విషయాలను మార్గాలుగా వర్ణించారు. ఆత్మ రథికుడు. రథికుడు చక్కని గ్రహణశక్తి గలవాడై సారథిని-గుర్రాలను అదుపులో ఉంచేలా చేస్తేతప్ప, తన లక్ష్యాన్ని తాను చేరలేడు. ఇంద్రియాలు దుష్టాశ్వాల మాదిరి కుపథానికి ఈడ్చి, అతణ్ణి పతితుణ్ణి చేయవచ్చు. ఈ రెండు ఇడా -పింగళ శక్తులు, సారథి చేతిలో ఉన్న పగ్గాలు. అతను ఈ గుర్రాలను సవరించుకోవాలంటే ఈ పగ్గాలను పట్టుకోవాలి. మనం నియమవంతులం కావటానికి శక్తిమంతులం కావాలి. ఆ శక్తిని సంపాదించుకోకుంటే మనం మన పనుల్ని అదుపులో ఉంచుకోలేము. యోగమొక్కటే మనసులను నియమితులను చేయటానికి సమర్థమైనది. యోగలక్ష్యం నైతిక ప్రభావాన్ని చేకూర్చుటే! యోగులు ఈ ఇడా - పింగళ ప్రవాహాలను మూలాధారంగా నిరోధించి, మేరుదండమనే వెన్నుబద్ద మధ్యగా వ్యాపించిన సుషుమ్నా నాడి వెంట ప్రవహింప చేస్తారు. సుషుమ్నా నాడిలో ప్రవేశించినప్పుడు ఈ ఇడా పింగళ ప్రవాహాలు జ్ఞాన ప్రవాహాలుగా మారతాయి. ఇలాంటి స్థితి యోగుల్లోనే ఉంటుంది.

ప్రాణాయామంలో రెండవ పాఠం : ఒకే పద్ధతి అందరికీ పనికిరాదు. ఈ ప్రాణాయామాన్ని లెక్క ప్రకారం చేయాలి. ఈ లెక్కకు ఓంకారాన్ని ఉపయోగించవచ్చు.

ప్రాణాయామం చేసే పద్ధతి ఇది. బొటనవ్రేలితో కుడి ముక్కును నొక్కి పట్టాలి. ఎడమ ముక్కు వెంట గాలిని ఓంకారాన్ని నాలుగుమార్లు జపిస్తున్నంతకాలం లోనికి పీల్చాలి. తర్వాత తర్జనితో ఎడమ ముక్కును నొక్కి పెట్టి మనసా ఓంకారాన్ని ఎనిమిదిసార్లు ఉచ్చరించునంతకాలం గాలిని లోపలే కుంభించాలి. తర్వాత బొటనవ్రేలిని కుడి ముక్కు నుండి తీసి, ఎడమ ముక్కును మూసి, కుడి ముక్కుతో ఓంకారాన్ని నాలుగుసార్లు

ఎవడు బ్రాహ్మణుడు ?

మూలం: బుద్ధుని ధర్మపదం

అనువాదం: అనువాది ఆనందమోహన్

ఉచ్చరించునంత కాలం గాలిని వదిలివేయాలి.

ఈ వదిలివేయటం పూర్తికానున్నప్పుడు పొత్తి కడుపును వేగంగా అక్కళించి, లోపలి గాలినంతా బయటికి పోయేలా చేయాలి. తర్వాత ఎడమ ముక్కును మూసి, ఓంకారాన్ని నాలుగుసార్లు ఉచ్చరిస్తూ, కుడి ముక్కునుండి గాలిని పీల్చాలి. తర్వాత కుడి ముక్కును బొటనవ్రేలితో నొక్కి 8 సార్లు ఓంకారాన్ని జపిస్తూ కుంభించాలి. తర్వాత ఎడమ ముక్కుతో ఓంకారాన్ని నాలుగుమార్లు జపిస్తూ గాలిని వదలాలి. ఇందాకటి లాగే పొత్తికడుపును అక్కళించాలి. ఇలా రెండుసార్లు ధ్యానానికి కూర్చున్నప్పుడెల్లా చేయాలి. ఇది నాలుగుసార్లు ప్రాణాయామం చేసినట్లవుతుంది. ఒక్కొక్క ముక్కు వెంట రెండేసి ప్రాణాయామాలు చేయాలి. నువ్వు ప్రాణాయామం చేసే ముందు ప్రార్థన చేయటం మంచిది.

ఇలా వారం రోజులు అభ్యాసం చేయి, తర్వాత క్రమంగా పూరక-కుంభక-రేచక కాలాలను వెనకటి నిష్పత్తి చెడకుండా క్రమంగా పెంచాలి. పూరకంలో 6 జపిస్తే, కుంభకం 12. ఈ అభ్యాసం పుణ్యభావాన్ని - చిత్తశుద్ధిని -ఆధ్యాత్మికతను పెంచుతుంది. అడ్డుత్రోవలు తొక్కవద్దు. ఏవో సిద్ధుల్ని సాధించటానికి ప్రయత్నించవద్దు. మనకు ఏది ప్రీతికరమో అదొక్కటే మన వెంట వస్తుంది. అదే అభివృద్ధి చెందుతుంది. రాజయోగం వల్ల ఈశ్వర దర్శనం చేయాలనుకొనేవారు, మానసికంగా, శారీరకంగా, నైతికంగా ఆధ్యాత్మికంగా బలవంతులై ఉండాలి.

లక్షమందిలో ఒక్కడు ముక్తికోసం ప్రయత్నిస్తాడు. కొంతమంది మాత్రమే సత్యదర్శనం చేయగలుగుతారు. కాని దేన్నయినా సాధించాలంటే, సత్యానికై ప్రాణత్యాగం చేయటానికైనా సిద్ధపడాలి.

(శ్రీరామకృష్ణ మఠం - హైద్రాబాద్ వారి సౌజన్యంతో సం॥)

భాగవత సుధ

- శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,

(గండిక్షేత్రము)

ఉ "ఫాలము నేల మోపి, భయభక్తులతోడ నమస్కరించి, భూ
పాలకులోత్తముండు గరపద్మములన్ ముకుళించి, నేడు నా
పాలిటి భాగ్యమెట్టిదియొ? పావనమూర్తివి, దివ్యకీర్తి వీ
వేళకు నీవు వచ్చితి వివేక విభూషణ! దివ్య భాషణా ! "

(1-488)

ప్రియమైన ఆత్మ బంధువులారా !

మీరు వింటూండే శ్రీమద్భాగవతము. పురాణ తిలకము, ఆధ్యాత్మ రత్నము, జ్ఞాన ప్రదీపము-ఇవన్నీ శ్రీ వేద వ్యాసులవారు భాగవతాన్ని వుద్దేశించి పల్కిన ప్రశంసలు.

పరీక్షిత్తునికి శాపం వచ్చింది. తాను ఏడు రోజులలోనే చస్తాడు. తనకు యేడు రోజులలోనే ముక్తి కావాలె."ఏడు దినంబుల ముక్తిం గూడగ నేరీతి వచ్చు"నని ఆరాటపడ్డాడు. ఆయన పుణ్యం పండింది. అనిరీక్షితంగా, అనాహుయమానంగా పూర్ణ పురుషుడు శుక బ్రహ్మ తనకు తానుగా వచ్చినాడు. మా "విడి పూలు" అనే పుస్తకంలో ఒక సూక్తి వ్రాయబడింది. "పుణ్యం పండితేనే సుమా! పూర్ణ పురుషుల దర్శనం లభించేది."

భాగవతంలో ఒక విశేషమేమంటే - గురువును వెతుక్కుంటూ శిష్యుడు పోవడమంటూ లేదు. శిష్యుని వద్దకు గురువే వస్తాడు. శిష్యుడు పరిపక్వమైన శిష్యుడుగా మాత్రం వుండాలె. పరీక్షిత్తుని వద్దకు శుకముని వచ్చాడు. వ్యాసుని వద్దకు నారదుడు వచ్చాడు. ధ్రువుని విషయమూ,

ప్రహ్లాదుని విషయమూ అంతే. దారిన పోతూండే రహూగణునికి జడభరతుని జ్ఞానోపదేశం అనాహుయమానంగా తటస్థించింది. పండు పక్వమైతే చాలు, చిలుక దాని పాటికదే వస్తుంది. కమలం వికసించడం తరువాయి తుమ్మెద అదే వెతుక్కుంటూ వస్తుంది.

చిత్తూరు ఓంకార ధ్యాన మందిరంలో నేను ఉపన్యాసాలు చేస్తూండే సమయమది. ఒకప్పుడు ఒకాయన "స్వామీ ! మంచి గురువు ఎక్కడ దొరుకుతా"డని నన్నడిగాడు. "ఆంధ్రప్రభలో, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వాంటెడ్ కాలంలో వేసి చూడండి" అని నేనన్నాను.

అరే! బుద్ధిమంతుడా! నీవు మంచి శిష్యుడవై తయారుగా వుండు! మంచి గురువు నిన్ను వెతుక్కుంటూ వస్తాడు. గురువు ఎక్కడ లేడు? 'ఈశ్వరో గురురూపేణ గూఢశ్చరతి భూతలే". ఈశ్వరుడు గురు రూపంలో సర్వత్రా సంచరిస్తూనే వున్నాడు. సచ్ఛిష్యుడే అపురూపం.

డాక్టరు అనిబెసెంటు ఒకచోట ఒక మాట అన్నారు. "మనుష్యుడు దేవుని వెతుకుతుంటాడని బైబిలు చెప్పింది. దేవుడు మనుష్యుని వెతుకుతూంటాడని నేనంటూన్నాను."

గ్రామఫోను రికార్డులో ఒకచోట ఒక పాట నేను విన్నాను. "దేవుడున్నాడా" అని మనుష్యునికి సంశయమట." మనుష్యుడున్నాడా" అని దేవునికి కూడా సంశయమట.

కాళ్లు, చేతులు, తలకాయ వుంటేనే మనుష్యుడైనట్లు కాదు. లోపల మనుష్యత్వముండాలె. మనుష్య బుద్ధి వుండాలె. దయయు, సత్యంబు లోనుగా మనుష్య స్వభావ లక్షణాలున్నప్పుడే నిజంగా వాడు మనుష్యుడైనట్లు. మనుష్యులుగా కనపడే వారంతా మనుష్యులు కాదు. "మనుష్య రూపాః పశవః -మృగాః చరంతి." బైట నరుడు, లోపల వానరుడై వుంటే లాభం ఏమి? 'ఈ మనుష్యులంతా గత జన్మంలో కోతులుగా వుండినారు" అని చార్లెస్ డార్విన్ చెప్పినాడు. నాకు మాత్రం

చాలామంది యిప్పుడే కోతులుగా కానొస్తున్నా"రని శ్రీ వినోబాబావే గారన్నారు.

లోపల మనుష్యత్వం, బైటా మనుష్యుడుగా వుంటే అట్టి మనుష్యుని కోసం భగవంతుడు వెతుకుతూంటాడు. పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం తన ప్రక్కలో ఉంటే, శ్రీకృష్ణుడు ఒక్క అర్జునునికే యెందుకు గీతోపదేశం చేసినాడు? అతడు బైటా నరుడు, లోపలా నరుడు, నరోత్తముడు సుమా.

సప్తాహాల్లో నేను భాగవతాన్ని ఉపన్యసించేటప్పుడు యేడు విభాగాలుగా చేసుకొని ఉపన్యసించేవాణ్ణి. ఆ విభాగాలే సప్త జ్ఞానభూమికలు. శుభేచ్ఛ, విచారణ, తనుమానస, సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థాభావన, తుర్యగ, ఈ యేడే సప్త జ్ఞాన భూమికలు.

"దాసో ఽహమితి యా బుద్ధిః పూర్వమాసీజ్జనార్దనే

దాకారోఽపహృతస్తేన గోపీవస్త్రాపహారిణా"

ప్రారంభంలో నేను ''దాసోఽహ''మంటూ శ్రీకృష్ణుణి సమీపించాను. ఆ గోపీ వస్త్రాపహారి నా "దాసోహం"లోని "దా"ను అపహరించినాడు. "సోహం" మిగిలింది. భక్తి దాసోహం, జ్ఞానం సోహం.

మీరాబాయి అనింది "పగలు దాసిని, రాత్రికి రాణిని" అని. ద్వైత ప్రతీతి వుండేవరకు దాసోహం భావన. అది పోతే సోహం.

భక్తి శాస్త్రం ద్వైతాన్ని అద్వైతం చేస్తుంది. జ్ఞానశాస్త్రం ద్వైత్వాన్ని నిషేధిస్తుంది. భక్తిశాస్త్రం వ్యవహార సత్తాను పారమార్థిక సత్తా చేస్తుంది. జ్ఞాన శాస్త్రం వ్యావహారిక సత్తాను ప్రాతిభాసిక సత్తా చేసేస్తుంది. ఒకటి సృష్టి దృష్టి. రెండవది దృష్టి సృష్టి.

పరీక్షిత్తుని జన్మ సగుణబ్రహ్మ దర్శనంతో ప్రారంభమైంది. ఆయన ప్రసవ వేదనతో పుట్టలేదు. పరమాత్ముని దర్శనంతో పుట్టినాడు. నిర్గుణ

బ్రహ్మజ్ఞానంతో తత్త్వమసి మహావాక్య బోధతో ఆయన జన్మ ముగిసింది.

"అజ్ఞానంచ నిరస్తం మే - జ్ఞాన విజ్ఞాన బోధయా" (12-67) "స్వామీ! మీ జ్ఞాన విజ్ఞాన బోధతో నా అజ్ఞానం తొలగిం"దని గీతలో అర్జునుడు చెప్పిన విధంగానే పరీక్షిత్తుడు తన అనుభవాన్ని శుక మహర్షికి విన్నవించాడు. దేహాత్మ బుద్ధే అజ్ఞానం.

"సర్వ వేదాంత సారం హి - బ్రహ్మాత్మైకత్వ లక్షణమ్

వస్త్వద్వితీయం తన్నిష్ఠం - కైవల్యైక ప్రయోజనమ్."

అద్వితీయ బ్రహ్మాత్మ జ్ఞానము భాగవతంలో ప్రతిపాదింపబడిందని శ్రీ వ్యాసుల వారే చెప్పినారు. "కైవల్యైక ప్రయోజనమ్"-ఏకమాత్ర కైవల్య నిష్ఠ భాగవత ప్రయోజనము. వ్యాసులవారు చెప్పిన యీ "కైవల్యైక ప్రయోజనం" అనే ఈ మాటనే అందుకొని పోతనామాత్యుడు "శ్రీ కైవల్య పదంబు జేరుటకునై" అని తన ఆంధ్ర భాగవతాన్ని ప్రారంభించినాడు. తుకారాం మహారాజు కూడా "సిద్ధాంత అద్వైతకా - మజా భక్తి కా" - "వస్తువు అద్వైతము. శిల్పము (పాకము) భక్తి" అని భాగవతంపై తన అభిప్రాయాన్ని వెల్లడించినాడు.

- శ్రీ మాతా గురుచరణానన్ద

భక్తి శాస్త్రమైన భాగవతానికి జ్ఞానభూమికలను ముడిపెట్టుట సంభవిస్తుందా? అనే శంకకు సమాధానంగా యిన్ని మాటలు చెప్పడం జరిగింది. ఇంకా యెన్ని ప్రమాణాలు, యుక్తులైనా యివ్వవచ్చు. ప్రస్తుతానికి చాలు. ప్రసంగం వచ్చినప్పుడు చర్చిద్దాం.

ఏడు రోజులలో పాము కరిచి చచ్చిపోతానని పరీక్షిత్తునికి తెలిసింది. బ్రాహ్మణుని మెడలో చచ్చిన పాము వేసినాడు. తన మెడకు బ్రతికిన పాము వచ్చింది. అపరిహార్య పరిస్థితికి ఆవేదన బొంది లాభం లేదని ఆ పుణ్యాత్ముడు నిశ్చయించుకొన్నాడు. జీవిత సమస్యను మరణంతో తీర్చడం కాదు కావలసింది, అది యెటూ మరణమే తీర్చుతుంది. దానిలో తన పురుషార్థమేముంది ? పురుషార్థపరుడు మరణ సమస్యను జీవితంతో తీర్చాలె. అదొక్క మహా కళ, అదొక్క మహా విద్య.

"పుట్టేటప్పుడు కాపాడిన ప్రభువు చచ్చేటప్పుడు కాపాడడా" అనే విశ్వాసం పరీక్షిత్తునికి వుంది. పరీక్షిత్తుడు భక్తుడు. శ్వాసతో కాదు. విశ్వాసంతో జీవిస్తాడు.

ఏడు రోజులలోనే ముక్తి బొందాలె. అధికారి పురుషునికి యేండ్లు పూండ్లు అక్కరలేదు. ఏడు రోజులు చాలు. ఖట్వాంగుడు రెండు గడియలలోనే ముక్తుడైనాడు. బుద్ధిమంతుడు కోరవలసింది దీర్ఘ జీవితం కాదు. దివ్య జీవితం. దీర్ఘ జీవితం ప్రారబ్ధాధీనం. దివ్య జీవితం పురుషార్థాధీనం. .జీవితాన్ని పొడిగించుకొనేది మన అధీనంలో లేదు. ప్రయత్నిస్తే బలిపించుకోవచ్చు. జ్ఞాన దేవుడు ఒక్క సంవత్సరమే జీవించాడు. శంకరాచార్యులవారు ముప్పై రెండేండ్లు బ్రతికారు. రామతీర్థుల వారి జీవితం ముప్పై మూడేండ్లే. వివేకానంద స్వామిజీ జీవించింది ముప్పై తొమ్మిది యేండ్లే. వారు దీర్ఘ జీవులు కాదు. కాని దివ్య జీవులు.

బావిలోకి త్రాడంతా పోయినా ఫరవాలేదు. బెత్తెడు మిగిలి వుంటే చాలు. మొత్తం అంతా బైట వేయొచ్చు. పరీక్షిత్తునికి జీవితంలో ఏడు రోజులే మిగిలింది. ఆ వారం రోజులలోనే ఆయన ముక్తుడైనాడు.

ఏడు దినాలల్లో చావాలని పరీక్షిత్తునికి శాపం వచ్చింది. ఏడు దినాలలో చచ్చేది పరీక్షిత్తుడే కాదు, మనం కూడా ఏడు దినాలలోనే చచ్చేది. ప్రతివానికీ మృత్యువు వారం రోజులలోనే - ఆదివారమో, సోమవారమో, మంగళవారమో, బుధవారమో, గురువారమో, శుక్రవారమో, తప్పితే శనివారమైనా తప్పదు. ప్రతివాని చావూ వారం రోజులలోనే. పురాణాలల్లోని కథలు చచ్చినవాళ్ళ కథలు కాదు. కథలు మనవి. పేర్లు చచ్చినవాళ్ళవి. మన పేర్లు చెప్పితే మనకు కోపం రాదా మరి! అందుకుగా, ఎందుకు లేనిపోని తంటా అంటూ వేదవ్యాసుల వారు చచ్చినవాళ్ళ పేర్లతో పరోక్షంగా మన కథనే చెప్పినారు. పురాణాలలో

పరోక్ష భోధ చెప్పబడింది. కాబట్టే పురాణాలను మిత్ర సమ్మితాలని అన్నారు.

పరీక్షిత్తునికి మోక్ష వాంఛ కల్గడమే 'శుభేచ్ఛ'. ఇది మొదటి భూమిక. కపిలాచార్యుని జ్ఞానబోధ పురంజనోపాఖ్యానం వగైరా. యీ ఘట్టాలు 'విచారణ' అనే రెండో భూమిక. జడ భరతుని కథ, వృత్రాసురుని కథ – వైరాగ్యాన్ని ఉద్బోధన చేసే యీ ప్రకరణాలు 'తనుమాస' అనే మూడవ భూమిక. ప్రహ్లాద గాథ, బలి చక్రవర్తి ఘట్టం 'సత్త్వాపత్తి' అనే భూమికకు చెందింది, గోపికా ఘట్టం 'అసంసక్తి' అనే భూమిక. గోపికలు సంసారంలో వున్నా వారు సంన్యాసినులు. "సంత్యజ్య సర్వ విషయాన్" (10–29–31) అని వారే అన్నారు. ఉద్ధవ గీత "పదార్థాభావన" అనే ఆరవ భూమిక. పరీక్షిత్తునికి శుకయోగి ద్వాదశస్కంధంలో "తత్త్వ మసి" మహావాక్య బోధ (12–5–11) చేసినాడు. అది తురీయమనే భూమిక. ఇవే సప్త భూమికలు.

అసలుకు భాగవతంలో కథలు కాదు, బ్రహ్మ కథలు. కథల మూలంగా, దృష్టాంతాల మూలంగా భక్తి, జ్ఞాన వైరాగ్యాలను ప్రబోధించుట వ్యాసుల వారి పద్ధతి. కథల కోసం కథలు కాదు.

" కథా ఇమాస్తే కథితా మహీయసాం

వితాయ లోకేషు యశః పరేయుషామ్ !

విజ్ఞాన వైరాగ్య వివక్షయా విభో !

వచో విభూతిర్నతు పారమార్థ్యమ్ !! (12–13–14)

కథలు పరమార్థం కాదు. "వచో విభూతిః" వాగ్విలాసం. వాచారంభణం. విజ్ఞాన, వైరాగ్య, వివక్ష కోసం కథలు చెప్పబడినాయని శ్రీ వ్యాసుల వారే చివరిలో అన్నారు.కథలే అయితే భాగవతము సామయిక వస్తువుగా వుండిపోయేది. భాగవతము ఆధ్యాత్మ దీపము. కాబట్టే సార్వకాలీన వస్తువై నిలబడింది.

శ్రీరామకృష్ణ కథామృతం

– శ్రీ రామకృష్ణ పరమహంస

అవతార పురుషులు, లేక వారి అంశతో జన్మించిన వారిని ఈశ్వరకోటి అంటారు. సాధారణ మనుష్యులను జీవులు లేక జీవకోటి అంటారు. జీవకోటికి చెందిన వారు సాధనలు చేసి భగవంతుణ్ణి పొందుతారు. వారు సమాధిస్థితిని పొందాక తిరిగిరారు.

ఈశ్వరకోటికి చెందిన వ్యక్తి రాకుమారుడు లాంటివాడు. ఏడంతస్తుల భవనంలోని అన్ని అంతస్తులకు వెళ్లే ద్వారాల తాళం చెవులు అతడివద్ద ఉంటాయి. అతడు ఏడు అంతస్తులను ఎక్కగలడు. మళ్ళీ తన ఇష్టానుసారం క్రిందికి దిగిరాగలడు కూడా. జీవకోటికి చెందినవాడు ఒక సాధారణ ఉద్యోగి లాంటివాడు. అతడు భవనంలోని కొన్ని గదుల్లోకి మాత్రమే వెళ్ళగలడు. అంతకు మించి అతడు వెళ్ళజాలడు.

జనకుడు జ్ఞాని. సాధనలు చేసి జ్ఞానాన్ని సముపార్జించుకున్నాడు. కాని శుకమహర్షి సాక్షాత్తు జ్ఞానమూర్తియే. శుకమహర్షికి సాధనలు చేసి జ్ఞానాన్ని సంపాదించవలసిన అవసరం లేకపోయింది. నారదుడు కూడా శుకమహర్షిలా బ్రహ్మజ్ఞాని. కాని లోకులకు ఉపదేశించే నిమిత్తం ఆయన భక్తిని ఆశ్రయించుకుని ఉండేవాడు. ప్రహ్లాదుడు ఒక్కోసారి "సో ఽహం' భావంలోను, మరోసారి దాస్యభావంలోను ఉండేవాడు. హనుమంతుడు కూడా అలాంటి స్థితిలోనే ఉండేవాడు.

తలచుకొన్నంత మాత్రాన అందరికీ అలాంటి స్థితి ఏర్పడదు. కొన్ని వెదురుగడలలో డొల్ల ఎక్కువగా ఉంటుంది. మరికొన్నింటిలో తక్కువగా వుంటుంది.

భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి తీవ్ర వైరాగ్యం ఉండాలన్నది నిశ్చయం. భగవన్మార్గంలో అవరోధాలుగా తోచే వాటిని తత్క్షణమే పరిత్యజించాలి. తరువాత చూచుకొనవచ్చులెమ్మని వాయిదాలు వేసుకోవడం మంచిది కాదు. కామినీ కాంచనాలు భగవన్మార్గంలోని అవరోధాలు. వాటి నుండి మనస్సును ఉపసంహరించుకోవాలి. మందకొడితనం, సోమరితనం ఉంటే భగవత్ప్రాప్తి అసాధ్యము.

ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

"ఉర్ధ్వం ఉన్నామయతీతి ఓంకార " ఉత్కృష్టమైన, ఆధార వస్తువు యొక్క సమీపమునకు తీసుకెళ్ళునదే ఓంకారము. ప్రణవమనిన, ఓంకార మనిన ఒకే అర్థము.

" ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ ధ్యేయం సర్వముముక్షుభిః "

నాశరహితమైన, ఏకాక్షరమైన ఓంకారమే బ్రహ్మ. ముముక్షువుల ద్వారా, ధ్యానించుటకు యోగ్యమైనదీ ప్రణవము. మోక్షమనేది ధర్మ, అర్థ, కామ, మోక్షములగు చతుర్విధ పురుషార్థాలలో చివరిదైనది. మోక్షము మానవ మాత్రునిచే పొందదగినది, సాధింపదగినది. పరమ పురుషార్థ సాధన భూతమైనదీ మోక్షము. ఇటువంటి మోక్షము కొరకు ప్రయత్నము చేయువారు, అనగా మోక్షమును పొందాలనే ఇచ్ఛగల స్త్రీలైనను, పురుషులైనను, బ్రాహ్మణులైనను, అబ్రాహ్మణలైనను, మానవ మాత్రులెవరైనను ముముక్షువులనబడెదరు.

" మోక్షేచ్ఛుః ముముక్షుః " అని చెప్పియున్నారు. ముముక్షువుల ద్వారా ఎల్లప్పుడు ధ్యానించుటకు తగినదీ ప్రణవము.

సామాన్యజనులు జపించ గూడదని అర్థము కాదు. ఓంకారమును మానవ మాత్రులెవరైనను జపించవచ్చును. ముముక్షువులనబడేవారు సదా తచ్చింతన, విచారణాదులతోయుండ వలెనని భావము.
" ఓంకారేణైవ ప్లవేన వృజినం సంతరిష్యసి"

పాపరూపమైన మలదోషమును జన్మజరామృత్యు ప్రవాహ రూపమైన సంసారమనే సముద్రమును ప్రణవ ధ్యాన జపాదులనే నావ ద్వారా సులభముగా దాటవచ్చును. ప్రణవ జపధ్యానాదుల వలన

అంతఃకరణము పరిశుద్ధమయి నాశరహితమైన అక్షర స్వరూపము యొక్క విచారణ, శ్రవణ మనన నిదిధ్యాసలచే స్వాత్మజ్ఞానమును పొందగలరని భావన.

ఎవరైనను ఈ ఓంకారమునుచ్చరించరాదనిన వారినీ విధముగా నడుగవలెను. అక్షరాభ్యాస కాలములో (బాలబాలికలకు) బాలురకు ఓం కారమును వ్రాయించి, నోటితో పలికించి, వారు యుక్త వయస్సులో నుండునపుడు, పెద్దయినపుడు ప్రణవమునుచ్చరించగూడదనిన వారికి నాలుక ఉందా లేదా అని అడగవలెను. ఇది పక్షపాతమైన బుద్ధి. పండితులకిది తగదు. ఓంకారము నుచ్చరించుటకు, మోక్షమును పొందుటకును అందరూ అర్హులే.

భగవద్గీతలో "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్! యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాంగతిమ్"! అని శ్రీ కృష్ణపరమాత్మ చెప్పియున్నారు. ఓం అనునట్టి ప్రణవమునుచ్చరించుచు ఆ యోంకారమునకర్థమైన పరమాత్మనగు నన్ను స్మరించుచు ఎవడు శరీరమును విడుచుచున్నాడో అట్టివాడు సర్వోత్తమమైన స్థానమును అనగా మోక్షమును పొందుచున్నాడు. ఇచ్చట యత్, తత్ శబ్దము లోను రహస్యమేమనగా జాతి కుల మత లింగ భేదములు లేకుండా ఎవరైనను ప్రణవమును జపించుచు తద్ధ్యేయమును భావించువారు తప్పక వారుత్తమ గతిని పొందుచున్నారు అని చెప్పెను. అందుచేత ప్రణవోచ్చారణకు అందరూ అర్హులే.

కఠోపనిషత్తులో యమధర్మరాజునచికేత సంవాదములో ఈ క్రిందివిధంగా యమ ధర్మరాజు చెప్పియున్నారు.

సర్వే వేదా యత్పద మామనన్తి
తపాగ్ంసి సర్వాణి చ యద్వదన్తి
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి

తత్తే పదం సంగ్రహేణ బ్రవేమ్యో మిత్యేతత్ ॥

వేదములన్నియు ఏ బ్రహ్మపదమును జీవిత పరమావధిగా పేర్కొనుచున్నవో, ఏది తపస్సులన్నిటి యొక్క ఉద్దేశ్యమని చెప్పబడుచున్నదో, దేనిని పొందదలచిన వారై జనులు బ్రహ్మచర్య వ్రతమును పరిపాలించుచున్నారో దానిని సంక్షేపముగ 'ఓమ్' అని నీకు చెప్పుచున్నాను. " ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏ తద్ధ్యే వాక్షరం పరమ్ । ఏతద్ధ్యే వాక్షరం జ్ఞాత్వా యోయదిచ్ఛతి తస్యతత్ ॥

అక్షర స్వరూపమైన అదియే బ్రహ్మము. అదియే అన్నిటికంటెను గొప్పది. ఈ నాశరహితమైన బ్రహ్మమును తెలిసికొనిన వాడు దేనిని కోరినా దానిని పొందగలడు అని చెప్పుచూ ఈ బ్రహ్మము శ్రేష్ఠమైన ఆలంబనము. అది సర్వోత్కృష్టమైనది. దానిని తెలిసికొనినవాడు బ్రహ్మలోకమున పూజింపబడును అని చెప్పిరి.

పతంజలి మహర్షియును 'తస్యవాచకః ప్రణవః " 'తజ్జపస్తదర్థ భావనమ్" అని రెండు సూత్రములతో ప్రణవ స్వరూపమును వివరించి యున్నారు. సర్వజ్ఞత్వాది విశిష్టుడగు ఈశ్వరునకోంకారము వాచకము. అనగా భగవంతుని పేరు ఓంకారము. ప్రణవమును జపించుచు ఆ ప్రణవ ప్రతిపాద్యుడగునీశ్వరుని ధ్యానింపవలెను. ఇదియే ఈశ్వర ప్రణిధానమనబడును. దీనివలన సమాధి సిద్ధి కలుగును.

"స్వాధ్యాయాద్యోగమాసీత యోగాత్స్వాధ్యాయమాచరేత్ ।

స్వాధ్యాయ యోగసంపత్త్యా పరమాత్మా ప్రకాశతే ॥ "

స్వాధ్యాయమనగా ప్రణవాధి దివ్య మంత్రజపం, పురుష సూక్తా అధ్యయనము. ప్రణవోచ్చారణ స్వాధ్యాయమునకు చెందినదే. ప్రణవ జపానంతరము ఈశ్వర భావనను చేయవలెను. ఈశ్వర భావనానంతరము ప్రణవమును జపించవలెను. ఇట్లు ప్రణవేశ్వరభావనలచే పరమాత్మ ప్రత్యక్షమగును.అనగా తన స్వరూపమును తాను తెలుసుకొనునని

భావము.

కేవలము ఓంకారమును జపించిన ఈ వుపాసనచే ఫలమేమైనా సిద్ధించునో? లేదో ! అని సందేహింప బని లేదు. ఫలము తప్పక సిద్ధించును.

" ఓంకార బిందుసంయుక్తం నిత్యం ధ్యాయన్తి యోగినః ।

కామదం మోక్షదం చైవ ఓంకారాయ నమో నమః ।

ఓంకారమునుపాసించువారికి ధర్మార్థ కామములు గలిగి, వేద విహిత కోరికలు సిద్ధించి, మోక్ష ధామము ప్రాప్తించును.

" సర్వేషాం మంత్రాణాం ప్రణవః ప్రాణముచ్యతే "

మనము నిత్యము చేయు పూజలలో కేశవాది నామములు, శివ, విష్ణు, లలితా మొదలగు దేవతలనుద్దేశించి అష్టోత్తర శతనామావళి, సహస్ర నామములతో ప్రతి నామమునకు ముందు ఓంను చేర్చి ఆ నామముచ్చరించినపుడే పూర్ణ ఫలము గలుగును. విధిగా జేసినట్లగును. ప్రణవము లేని మంత్రము ప్రాణము లేని శవముతో సమానమని అనుభవజ్ఞులు చెప్పియున్నారు.

" ఓంకార రథమారుహ్యా విష్ణుం కృత్వా సారథిమ్ ।

బ్రహ్మలోక పదాన్వేషీ రుద్రారాధన తత్పరః"॥ అని అమృనాదోపనిషత్ తెలియజేయుచున్నది. బ్రహ్మ పదము నన్వేషించు వాడును, ధ్యేయారాధన తత్పరుడును, వ్యాపక స్వరూపుడగు విష్ణువును రథసారథిగా చేసుకొని ఓంకారమనే రథము నెక్కి ప్రయాణము సాగింపవలెను. మరియు పై ఉపనిషత్తే చెప్పుచున్నది.

"తావదేవ గన్తవ్యం యావద్రథపథిస్థితః ।

స్థాతారథపతి స్థానం రథముత్సృజ్య గచ్ఛతి

సామాన్యముగా గ్రామాంతరము ప్రయాణము చేయు యజమాని రథమార్గమున్నంత వరకు రథమునందే పోయి, రథమార్గము ముగిసి,

గమ్యస్థానము చేరగనే, రథమును విడిచి పోవుచున్నాడో ఆ విధముగా పోవలెను. అనగా స్వాత్మజ్ఞానేచ్ఛ గల సాధకుడు సద్గురు సన్నిధిలో సేవాతత్పరుడై, వారిచే ప్రణవోపాసన విధానమును బాగుగా తెలిసికొని ప్రణవధ్యాన తత్పరుడై అంతఃకరణశుద్ధిని పొంది, ఆత్మానాత్మ విచారణ ద్వారా ప్రణవ ప్రతిపాద్యమైన పరబ్రహ్మమును తెలిసికొని అనగా స్వాత్మజ్ఞానమును పొందిన తరువాత సాధనభూతమైన ప్రణవమును వదలును. ప్రయత్న పూరుకముగ వదలవలసిన పనిలేదు. చెట్టునున్న పండు కొంత కాలమునకు తనంతటతానే పడిపోవును. ఆ విధముగా సాధనభూతమైన వస్తువు వీడునని భావన. ఓం తత్సత్ ఓమ్.

సచ్చిదానందరూప సద్గురు రాయా!

– శ్రీమతి కె. బాలసరస్వతి (తెనాలి)

గురుపాదస్పర్శ శిరమున తాకిన చాలు తొలగిపోవు
అజ్ఞానజనిత గాఢ మోహాంధకారము
గురుకృపాదృష్టి మేను సోకిన చాలు సడలిపోవు
అవిద్యా జనిత కర్మ బంధాల వలయంబు
గురుని దివ్య మంత్రంబు మదిని మెదలినచాలు
భువన త్రయమెల్ల బ్రహ్మమై భాసిల్లు
గురుపాద తీర్థంబుగ్రోలినంతెనె కల్లు
అండపిండ బ్రహ్మాండాతీత బ్రహ్మానుభవము
జన్మ మృత్యు జరావ్యాధి సంతలోన జీవుడు
తిరిగి తిరిగి విసిగి వేసారి
గురుపాద పద్మంబునుజేరి జ్ఞానైశ్వర్యంబునుపొందు కట్ట కడపటికి
సద్గుణధీ విశాల సచ్చిదానందరూప సద్గురు రాయా!

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 10
జంతుబలి నివారణ

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య (తిరుపతి)

స్వామి తిరుమల నుండి దిగి 1926 జూన్ మాసంలో ఏర్పేడు వద్ద వ్యాసాశ్రమం స్థాపించారు. ఆశ్రమం స్థాపించిన ప్రదేశంలో కాశీబుగ్గ తీర్థానికి తూర్పున గల చిన్న కోనేటి గట్టున ఒక పెదజువ్వి చెట్టుండేది. పూర్వం ఆ చెట్టు వద్ద చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన ప్రజలు శక్తిపూజలు చేసి జంతు బలులు ఇచ్చేవారు.

ఆశ్రమం స్థాపించిన తర్వాత అక్కడ అట్టి హింసాత్మకమైన కృత్యాలు తగవని స్వామి తన శిష్యుల ద్వారా గ్రామస్థులకు చెప్పి పంపారు. ఐనా వారు స్వామి మాటను పెడచెవిని బెట్టి జంతుబలులు ఇవ్వడానికే నిర్ణయించుకొన్నారు.

అప్పుడాశ్రమ సాధువులు వారి వద్దకు పోయి “ సోదరులారా ! ఇచ్చట జంతుబలులు ఇయ్యరాదని మా స్వామివారి సందేశం. మీరు దయచేసి ఈదుష్కృత్యం విరమించండి, మీకిది సమ్మతం కాకుంటే ముందు మా తలలు తెగనరకండి ”! అంటూ బలిపీఠం వద్ద తలలు వంచి నిబడ్డారు.

అంత ఆ గ్రామ ప్రజలు హింసా ప్రవృత్తి విడనాడి బలికుద్దేశించిన జంతువులను విడిచిపెట్టారు. దయామయులైన శ్రీ మలయాళ సద్గురు దేవులు జంతుబలులనూ, మాంసాహారాన్ని నిరసించారు. శక్తికి బలియిచ్చిన జంతువులను తినడంలో దోషం లేదనే పిడివాదాన్ని ఖండించారు.

“నాగరకత లేని ఆదిమ కాలంలో భగవద్ధ్యాన విధానం తెలియనివారు జంతు బలులను ఏర్పాటు చేశారు. ఇప్పుడు గూడ పశు

ప్రాయులగు మనుజులే జంతుబలులను సమర్థిస్తారు. పూర్వం నరబలి కూడా ఉండేది. అది ఇప్పుడు నిషిద్ధమయింది. వివేకం వికసించినవారు క్రూరకృత్యాలు చేయరాదు. విద్యా విహీనులే ఇట్టి నీచపు పనులు చేస్తారు” అని స్వామి జంతుబలులను ఖండించారు.

“ ఒక ప్రాణిని వధించడం ఏ మాత్రం ధర్మం కాదు. దున్నపోతు, పంది మొదలగు జంతువుల బలిచే తృప్తి నొందే ఆ దేవత లెట్టివారో గమనించండి?

ఇలా అహింసను ప్రచారం చేశారు. సహజ కవి, హరికథకుడూ అయిన శ్రీ సాయం వరదదాసు స్వామికి ముఖ్య శిష్యుడయ్యాడు. స్వాములవారి ప్రబోధాలను ఈ కవి విస్తృతంగా ప్రచారం చేశాడు.

శ్రీ వరదదాసు రచించిన ‘అహింసా పుష్పం’ అనే ఒక లఘుగ్రంథం జంతువధను అరికట్టడానికే వ్రాయడమయింది. అందులో జంతువధలోని అనౌచిత్యం, క్రూరత్వం చక్కగా నిరూపించడమయింది. ఆ గ్రంథం చదివిన వారనేకులు మాంసాహారం వర్జించారు.

ఇలా స్వామి తన ప్రబోధాలతోనూ, తన శిష్యుల ద్వారానూ జంతు బలినరికట్టే తీవ్ర ప్రయత్నం కావించారు.

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు అన్నదాన నిధికి క్రిందివారు పైకం ఇచ్చారు

1. అప్పనపద్మనాభరావు , (బెంగుళూరు) - రూ.15000/-
   (కీ॥శే॥ ఎ.వెంకటనాగేశ్వర్ పేరిట)
2. సి.కుసుమ, కేరాఫ్ : బి.రాధాకృష్ణయ్య (శ్రీకాళహస్తి) –రూ.15000/-
   (చిలుకూరి సీతారామయ్య పేరిట)

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు ఈ క్రిందివారు పైకం ఇచ్చినారు

1. కోట్ల మీనాలక్ష్మి (పెనుగొండ,ప.గో.జిల్లా) - రూ.28,630/-
2. ఇ.విజయ సింహారెడ్డి వగైరా, ఎస్.వి.ఎ.ప్రభుత్వ - రూ.25,116/-
   డిగ్రీ (పురుషుల) కళాశాలలో 1984–1987 బ్యాచ్‌లో చదివిన పాత విద్యార్థులు
3. ఎన్.ఆదిలక్ష్మమ్మ, భర్త : లక్ష్మీ నారాయణ, (ఒంగోలు) - రూ.10,000/-
4. కందుకూరు పార్థసారథి (డోన్) - రూ.11,000/-

భారతావని

- శ్రీ అరవిందులు

దివ్య శక్తి స్వరూపిణి – భరతమాత

భారతమాత కేవలం ఒక మృణ్మయ పాత్ర వంటిది కాదు. ఆమె దేవతామూర్తి, శక్తి స్వరూపిణి. అన్ని దేశములకు అట్టి దివ్యత్వముగలదు. అయ్యవి వానివాని ప్రత్యేక ఉనికికి తోడ్పడుచు, వాని వాని ప్రత్యేకతను పోషించుకొనుచున్నవి. ఆయా దేవతామూర్తుల ప్రాబల్యమునందున్న మానవులకన్ననూ, ఆ మూర్తులు యథార్థములగుటచే అవి ఉన్నత స్థానమునకు చెందియున్నవి. ఈ పృథ్విపై మానవచేతనకు తమ ప్రాబల్యమును ప్రయోగించి వారిని రూపొందింప జేయుటయే యిచ్చట ఆ మూర్తి యొక్క ఉనికి, కార్యక్రమమునై యున్నది. ఎవరు తన వ్యక్తిగత చేతన మాత్రమే దేశీయముగను, జాతీయముగను పనిచేయుచున్నటుల భావింతురో, యీ కానుపించునదంతయు తమ నిర్మాణమేయని వూహింతురో వారు తదన్యములగు మహత్తర శక్తియో, విశ్వగతియో ఒకటున్నదనియు, ఆ శక్తి ప్రతి కార్యమునకును వెనుకనుండి పనిచేయుచున్నదనియు, వానిని రూపొందించుచున్నదనియు తలపకుండుట సర్వ సహజము.

భగవంతుని ఉన్నతజ్ఞాన ప్రసారమునకు భారతదేశం

ఎట్టి పరిస్థితులందైనను, ఎంతటి అపాయములందైనను ఉన్నత జ్ఞానమును – అధిక సంఖ్యాకులచేతనో లేక అల్ప సంఖ్యాకుల చేతనో – సర్వదా అతి సమర్థవంతముగ పోషింపబడు నొక దేశమును భగవంతుడు తన కొరకై నియమించుకొనుచున్నాడు. ప్రస్తుతము యీ చాతుర్యుగమందట్టిది మన భారతదేశమేయైయున్నది. భగవంతుడు ఆ జ్ఞానమున లయమై పరిపూర్ణమైన తదనుభవానందమును పొంద సంకల్పించినపుడంతయు అనగా ద్వంద్వముల, పోరాటముల, దుఃఖ

పూరితములైన కార్యకలాపములయొక్కయు, స్వార్థము, అసమర్థత, తామసిక, రజోగుణములయొక్కయు–క్లుప్తముగ జెప్పవలయుననిన, కలికాలానుభవమును పొంద సంకల్పించి నపుడంతయు భగవంతుడు తన మాయచే భారత జ్ఞానము నావరింపజేసి, బలహీనపరచి, అణచి వేయును. తన్మూలమున భారతమాత అంతర్ముఖియై,, భగవంతుని లీలలయందు జోక్యము కలుగజేసుకొనక యుండును. పునః తానీ బురదలో నుండి పైకి రాదలచినపుడు నరునిలోని నారాయణుడు శక్తిమంతుడుగను వివేకి, జ్ఞాని, అనుగ్రహపూరితుడుగను కాదలచినపుడు మరల ఆ భగవంతుడే ఆ మాయను తొలగించి, తన జ్ఞానశక్తిని భారతదేశముపై ఆవరింపజేసి, అంతర్ముఖియైయున్న భారతమాతను పునః మేలుకొలుపుటచే, ఆమె సర్వప్రపంచమునకును ఆయా పరిస్థితుల కనువగు జ్ఞానమును, శక్తిని, స్వేచ్ఛను, స్వాతంత్ర్యమును ప్రసాదించును. భారతదేశమందు జ్ఞానము సంక్షిప్తమగు సమయమున యోగులందరు యీ ప్రపంచము నుండి ఏకాంతవాసమునకేగి వారి వారి వ్యక్తిగత ముక్తికి, ఆనందములకు యోగము నాచరింతురు. మరియు అల్పసంఖ్యాకులైన శిష్యులు ఏ వొకరిద్దరికొరకో పాటుబడుచుందురు. కాని, మరల జ్ఞానప్రవృత్తి యెప్పుడు విస్తరించునో అప్పుడు దానితోపాటు భారతదేశ ఆత్మ కూడా వికసించును. ఆ తరుణమున యోగి పుంగవులందరు పునః యీ ప్రపంచమున, యీ దేశము నందవతరించి ప్రపంచము కొరకే కృషి చేయుచుందురు. మరల జనకుడు, అజాతశత్రువు, కార్తవీర్యులవంటి రాజయోగులవతరించి సింహాసనాసీనులై జాతి గమ్యమునే లక్ష్యముగాగొని యీ ధరణి నేలుదురు.

ఆధ్యాత్మిక భావనాశక్తి భారతమాత

ప్రతి దేశము ఒక శక్తిస్వరూపమో లేక ఆయా మానవులందు గల పరిణామాత్మక శక్తియోయై యుండుటచే ఆయా ముక్తస్వరూపములు వాని వాని మూలసూత్రముల ననుసరించి జీవించుచున్నవి. అందు హిందూదేశము భారతమాత శక్తి స్వరూపముగ సజీవమైన గొప్ప ఆధ్యాత్మిక భావనాశక్తి. విశ్వసత్తయే ఆమె యొక్క ఉనికికి ప్రధానాలంబనము. కేవలము ఈ సుశీలత వలననే ఆమె అమర జీవులైన

దేశములందొకటిగ విరాజిల్లుచున్నది. ఈ సౌశీల్యమే ఆమె యొక్క అత్యద్భుత నిగ్రహశక్తికి గల పరమ రహస్యము. ఆమె యొక్క పునరుద్ధరణకును, శాశ్వతత్వమునకును గల ఆమోఘశక్తి.

అత్యద్భుతమైన సామర్థ్యము గల భారతజాతి

ఈ భారతజాతి ప్రకృతి కర్మాగారమునుండి యిప్పుడే వెలువడినదియో అపరిపక్వమైనదియో, నవనాగరికతా పద్ధతులందు నూతనమైనదియో, నవీన సృష్టియోగాని కాదు. భారతీయులు బహుసనాతనులు, ఈ పృధివిపై గొప్ప నాగరికతగల జాతులలోనివారు. ఈ భారతజాతి బ్రహ్మాండమైన జీవశక్తి గలది. బహుముఖఫలప్రదమైన గొప్పతనముగలది. గంభీరమైన చరిత్ర గలది. అత్యద్భుతమైన సామర్థ్యము గలదియునుకూడ. ఈ భారతదేశము విదేశీయుల శ్రమ ఫలితముగ, వివిధరూపములైన శక్తిని, తదితర మానవుల నాగరికతను తనయందు ఇముడ్చుకొని స్వశక్తినుత్తేజింప, ఉన్నతస్థాన మధిష్టించుటకై నియమబద్ధముగ జాతియైక్యతతో ఇప్పుడిప్పుడే పైకి లేచుచున్నది.

ఆధ్యాత్మికశక్తివంతుల వారసులు భారతీయులు

మనము సాధారణమైన సంతతికి జెందినవారము కాము. మన పర్వతరాజములవలె, భాగ్యవంతములైన నదులవలె బహుసనాతన సంతతివారలము. మన వెనుక మన పూర్వీకులు సాటిలేనట్టి అనేకములైన గొప్ప చరిత్రలను గలిగియున్నారు. ఆధ్యాత్మిక శక్తిని గడింప, అతివిషమ పరిస్థితులందు మానవజాతి యెంతటి దారుణములైన కష్టముల ననుభవింపవలసి వచ్చిందో అట్టి భయంకరములైన కష్టములన్నిటిని తామనుభవించి, మహాకఠిన నియమములకు గురియైయుండిరో, అట్టి మహనీయులకు వారసులము మనము. పరలోకమున కేగు తమ భర్తల ననుసరింప భక్తితో, చిరునవ్వులతో సహగమనమాచరించిన పతివ్రతామ తల్లులకు బిడ్డలము. ఎంతటి భౌతికశక్తినైనను ధిక్కరించగల ఆధ్యాత్మిక శక్తి గలవారలము మనము. ఎంతటి కష్టములనైనా భరించగల సమర్థులము మనము. భగవదావిర్భావమునకై భగవంతునిచే ఎంచుకొనబడిన ప్రజలము మనము. అత్యవసరములైన సమయములందంతయు ఎన్నియో

పర్యాయములు భగవంతుడు మనమధ్య అవతరించినట్లు మన చరిత్ర తెలుపుచున్నది. భగవదావిర్భావమునకై భగవంతునిచే నియమింపబడిన వారలమగుటచే మన హృదయములో భగవంతుడు నిలిచి యున్నాడు. రేపటి సూర్యోదయమెంతటి తథ్యమో మన భారతదేశము పునః ప్రకాశించుట అంతటి యథార్థమైనది, స్పష్టమైనదియును కూడ.

వీరులు, యోగులు, ఋషులు భారతభూమి పంట

బహుసనాతనమైనదియు, గొప్పదియునైన యీ భారతావని యొక్క గత ప్రభావములను, కీర్తిని ముందిడుకొని అనేకులు సనాతన ఋషులవలె, భావి, నాగరికతల ప్రేరణకర్తలవలె, ప్రస్తుత మన యీ దుస్థితియందు, క్షీణించుచున్న యీ మానవ సముదాయముల మధ్య అత్యద్భుతశక్తి పరాక్రమములు ప్రదర్శించియున్నట్టి ఆ కాలపు చరిత్రలను పునరుద్ధరింప రాదను, అనుచితభావములను వెల్లడించుచున్నారు. అది తప్పు ముమ్మాటికినీ తప్పు. శాశ్వతమైనది భారతభూమి. బహుసనాతనులు భారత ప్రజలు. అనాదియైనది మన మతము, మన శక్తి, గొప్పదనము పవిత్రత మేఘావృతములైనవేగాని యెట్టి పరిస్థితులందైననూ ఒక్కక్షణమైనను పూర్తిగా అంతరించి యుండలేదు. వీరులు, యోగులు, ఋషులు యీ భారతభూమికి సహజములైన ఫలములు. ఈ యోగపురుషులు జన్మించని కాలమే లేదు.

మానవాభ్యుదయము కొరకు భారత జ్యోతి

మనము తఱచు సనాతన ధర్మమైన హిందూమతమును గురించి మాటలాడుచుందుమేగాని మనలో బహుకొలదిమందికి మాత్రమే ఆ మతమనగానేమో తెలియును. తదితర మతములన్ననో ప్రబలమైన యొక వృత్తిగనో, లేదా విశ్వాసముతో కూడినవిగానో యున్నవి. కాని మన సనాతన ధర్మము సజీవమైనది. అయ్యది స్వానుభవముచే పొందదగినదేగాని మాటలచే నమ్మింపదగినదికాదు. ప్రత్యేకముగానున్న యీ ద్వీపకల్పమునందు మానవులకు మోక్షదాయినియైన యీ సనాతన ధర్మము తరతరములనుండి పోషింపబడుచున్నది. ఈ ధర్మమును బోధించుటకే భారతమాత పైకిలేచుచున్నది. భారతదేశము ఇతర దేశములవలె స్వార్థముకొరకో లేక బలహీనముగనున్న యిరుగు పొరుగు

శ్రీ మదాంధ్ర మహాభాగవతము

[illegible] (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

దేశములపై దండెత్తి ఆ దేశములను అణగద్రొక్కుటకొరకో పైకి లేచుట లేదు. భారతమాతకు అప్పగింపబడిన సత్యజ్యోతిని సర్వవ్యాప్తముగ ప్రసరింపజేయుటకొరకే ఆమె అభివృద్ధి గాంచుచున్నది. స్వర్గతుల్యమైన ఈ భారతమాత కేవలము మానవాభ్యుదయముకొరకే జీవించుచున్నది. అందులకే ఆమె అన్ని విధముల గొప్పది [illegible] ఏర్పడినది.

దివ్యజ్యోతి రక్షణకొరకు భారతదేశము

భారతదేశమున కిదియొక గొప్ప పరీక్షాసమయము. ఏమన తన ధర్మమును వీడి, ఆత్మను చంపుకొని, మనోవికార హేతువులగు కొన్ని మార్గముల ననుసరించుటవలన సంపన్నమైన పరిశ్రమలతోను, వర్తక వ్యాపారముల అభివృద్ధిగాంచుచు తదితర దేశములవలె కృతకమైన గంభీరత్వముతో తాను అభివృద్ధిజెందినను, శక్తిమంతమైన రాజకీయ, సాంఘిక నిర్మాణ జీవితమును నిర్మించుకొనిననూ, అపారమైన సైనికశక్తిని యేర్పరచుకొనిననూ, గొప్ప రాజకీయ తంత్రముల ప్రదర్శించిననూ, తన ఆదాయములందును, వాంఛల యందును తగు జాగ్రత్త గలిగి పట్టుదలతో వానిని విస్తరింపజేసుకొనిననూ, మఱియు అత్యధిక భూభాగముపై తన ప్రభావమును చెలాయించిననూ చెలాయింపవచ్చును. కాని, ప్రతీయమానమైన (అశాశ్వతములైన) యీ విశేషాభివృద్ధి పొందిననూ అయ్యది తన స్వధర్మమునకు మహాపరాధమే యగును. అంతియేగాక, సనాతన భారతావని. ఆధ్యాత్మిక స్వరూపములు శాశ్వతముగ అదృశ్యముగా వచ్చును. అందుచే తనకు గాని, తదితర జగత్తునకుగాని యెట్టి ప్రయోజనము లేకపోవుటయేగాక తదితర దేశములతో బాటు తానొకటియైయుండును. ఒక ప్రశ్న, అత్యంత సంపన్నమైన, శాశ్వతమైన ఆధ్యాత్మికానుభవమును, తదాత్మజ్ఞానమును సంపూర్ణముగ వదులుకొని యీ బాహ్యజీవనమునందు నిరపాయముగ వర్ధిల్లవచ్చునేమోగాని, మిగతా భూమండలమంతయు ఆధ్యాత్మిక సహాయముకొరకు, ఆ దివ్యజ్యోతి, రక్షణకొరకు అధికాధికముగ తనవైపు దృష్టిని మరల్చుచున్న యిట్టి తరుణమున భారతదేశము తన పిత్రార్జితమైన ఆధ్యాత్మికతను వదలుకొనుట హాస్యాస్పదము. కేవలమది దురదృష్టమనియే చెప్పవచ్చును. ఇయ్యది సంభవింపరాదు. నిశ్చయముగ

సంభవింపదుకూడ. అటులని ఆ అపాయము లేదని చెప్పజాలము. ఈ దినమో లేక మరుదినమో భారతదేశము యెదుర్కొనవలసిన తదితరములైన కఠిన సమస్యలెన్నియో గలవు. అయినను వానినన్నింటిని తప్పక జయించగలమనుటలో యెంతమాత్రమూ సందేహము లేదు.

ఆత్మ సత్యాన్వేషణయే భారతీయ జీవన సంకల్పము

భారతదేశ దృక్పథమునందుగల విశిష్టతయేమన, ప్రతి ఆకారమునకును వాని చేష్టలకునుగల ఆంతరంగిక హేతువును, అందుల కాధారభూతమైన శక్తిని, తదాత్మను ప్రతిదానియందును వెదకుటయే. భారతీయ జీవన సంకల్పమునందుగల మరొక ముఖ్య అంశమేమన, ఆత్మ సత్యమును కనుగొనజాలని యెడల, అద్దానియందే జీవించని పక్షమున, తనకు తాను అసంపూర్ణమైనటుల భావించును, అపరిపక్వమౌనటుల

ఎవరి కెఱుక ?

– ఆచార్య కె. సర్వోత్తమరావు (తిరుపతి)

[illegible]క్యమువినా తదితరములైన యెట్టి మధ్యస్థితుల [illegible]లదు. ఈ జగతి, యీ ప్రకృతి, వానియొక్క [illegible] భౌతికములుగనే కాక, ఆత్మతత్వములుగను, ఆధ్యాత్మికములుగను నిలచియున్నటుల భారతదేశము నమ్ముచున్నది. దేహి, ఆత్మసచేతన – యియ్యవి జడపదార్థములకన్నను, అచేతనాశక్తికన్నను గొప్ప శక్తిమంతములైనవి మాత్రమేగాక యీ బాహ్యసంపద నంతటి ఉత్పత్తికి కూడ అవియే మూలకారణములు. ప్రతిశక్తి వొక ప్రభావముగలది. లేక ఒక రహస్యాత్మకు కారణభూతమైయున్నది. ఈ ప్రపంచ భారమును మోయు శక్తి సచేతనా సంకల్ప మనబడుచున్నది. ఆ సంకల్పమును నిర్వహించుశక్తియే. ప్రకృతి ఒక యంత్రమువంటిది. అందు మరగుపడియున్న సచేతనకు యీ జడాత్మక విశ్వమొక రూపముమాత్రమే. కాబట్టి మానవుడు శాశ్వతముగ యీ భౌతికప్రకృతి యధీనములో నుండనవసరము లేదు. ఏలన, మానవుడు యీ జడపదార్థముచే సృష్టింపబడిన మనస్సో, ప్రాణమోగాని కాదు – అనగా ఆత్మయే యీ ప్రాణమును శరీరమును తన కార్యమునకై వినియోగించుకొనుచున్నదని యర్థము. అందుచే మనమిప్పుడు తెలుసుకొనవలసినదేమనగా – "ఈ ఉనికి యొక్క భావము, అందులకు యథార్థమైన హేతువు. ఉన్నతమైన ఆ హేతువునెరుంగుటకు దానియొక్క ధర్మమునను సరించుటకొరకే మా యీ గొప్ప ప్రయత్నము అభ్యాసము" నైయున్నది. ప్రకృతి అధీనమైన యీ జీవితమునుండి విమోచనము పొందుట కొరకును, తదుపరి యీ జడమునే మహత్తరమైన ఆధ్యాత్మిక సచేతనకు గొనిపోవుట కొరకును మేము ప్రయత్నించుచున్నాము. మానసిక బంధములచే గర్భితమైయున్న యీ జీవితమునుండి విముక్తులమగుట కొరకే ఆకాంక్షించుచున్నాము.

ఆత్మజ్యోతిలో నవీన దృక్పథం

మనము మన సనాతన భావములను, ప్రస్తుత భావములను ఆత్మజ్యోతి కిరణములచే ప్రసరింపజేసి యీ నవీన దృక్పథముతో పరిశీలించిచూచిన నయ్యవిఉత్కృష్టములైనవా లేక అనుకూలములైనవా యని విశదముకాగలదు. మనము చేయునదెట్టిదేయైనను, సృజనాత్మ కమైనదేయైనను, అయ్యది శాశ్వతమైన భారతదేశ ఆత్మతో అనుగుణ్యమై యుండవలయును.

భారతదేశము తన ప్రాచీన భావములనే శక్తివంతములైనవిగను అన్యోన్యములైనవిగను, పూర్ణత్వము గలిగినవిగను వ్యక్తపరచ వలయుననిన తన స్వసంస్కృతీ రూపములకు నూతన ఆకారముల నొసంగి తనను తాను రక్షించుకొనవలయును. అందుచే ఒకానొకప్పుడామె యీ సర్వభూమండలమునకు మార్గదర్శియై, జ్ఞానదీప్తి నొసంగియున్న దగుటచే, పునః తన ఆధ్యాత్మిక విజయయాత్రయనెడి జ్యోతి తరంగములచే ప్రజ్వరిల్లి దిగ్విజయముగ సర్వవ్యాప్తమై, సర్వ ప్రపంచమునకును విమోచన మొసంగగలదు.

భారతీయ సంస్కృతీ ప్రభావంలో మానవాళి

వివిధములైన ఆటంకములు యేర్పడుచున్నను భారతీయ సంస్కృతీ ప్రభావము, భారతీయ కేంద్రలక్ష్యము, తదున్నత భావములు, తమ సందేశమును ఒక్క భారతీయులకేగాక సకల మానవులకును అందించుచునే యున్నవి. **(అర్క సౌజన్యంతో)**

భాగవత సదస్సు - (శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో)

1. **20-08-2018 నుండి 26-8-2018 వఱకు**

   డా॥ సముద్రాల లక్ష్మణయ్య (తిరుపతి)

2. **18-9-2018 నుండి 24-9-2018 వఱకు స్వామీజీ**

3. **21-10-2018 నుండి 27-10-2018 వఱకు**

   పూజ్యశ్రీ స్వామిని శీలానంద (చిన్మయారణ్యం)

4. **26-11-2018 నుండి 2-12-2018 వఱకు**

   పూజ్యశ్రీ సంపూర్ణానందస్వామీజీ(హైద్రాబాద్)

5. **16-12-2018 నుండి 22-12-2018 వఱకు**

   పూజ్యశ్రీ పరావిద్యానంద స్వామిని (యాచారం)

6. **16-1-2019 నుండి 22-1-2019 వఱకు**

   పూజ్యశ్రీ శివానంద సరస్వతిస్వామిని (చైతన్యతపోవనం)

7. **23-1-2019 నుండి 29-1-2019 వఱకు**

   పూజ్యశ్రీ ప్రణవానంద స్వామీజీ (లత్తవరం)

8. **13-2-2019 నుండి 19-2-2019 వఱకు**

   పూజ్యశ్రీ జ్యోతిర్మయానంద స్వామిని (పాలకొల్లు)

ఇందులో పాల్గొనదలంచిన భక్తులు ఒకనెల ముందుగా జాబువ్రాసి నివాస వసతికి అనుమతిని పొందవలెను.

నాస్త్యన్తో విస్తరస్య మే

- ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

ఈ వాక్కు విభూతియోగనామకమగు పదియవ అధ్యాయం పంతొమ్మిదవ శ్లోకం చివరి భాగం. కృష్ణ భగవానుడు తనయొక్క విభూతి విస్తారములకు అంతము లేదని చెప్పడం ఈ వాక్య సారాంశం. అంతేగాక తనపట్ల సంలగ్నచిత్తులయినవారు పరస్పరం ముచ్చటించుకొంటూ బోధించుకొంటూ సర్వకాల సర్వావస్థలయందు సంతృప్తిని, ఆనందాల్ని అనుభవిస్తారని కృష్ణోపదేశం. సర్వభూతమయుడయిన స్వామిని గుర్తించడం పామరులకు సాధ్యం కాదు. అందువలన జగద్గురువు బాహ్యజగత్తులో తన ఉనికిని గుర్తించడానికి వీలుగా తన అనేక రూపాల విశదం చేశాడు. వాటిలో కొన్నింటిని ప్రస్తావించుకొందాం.

ఆదిత్యులలో విష్ణువు, ప్రకాశమానమయిన వాటిలో సూర్యుడు. మరుత్ దేవతానీకంలో మరీచి, నక్షత్రాలలో చంద్రుడు అతడే. చతుర్వేదాలలో సామవేద స్వరూపుడు. దేవతలలో వాసవుడు, ఇంద్రియాలలో మనస్సు, ప్రాణులలో చైతన్యం అతడే. రుద్రులలో శంకరుడు. యక్షులు, రాక్షసులలో కుబేరుడు, వసువులలో అగ్ని, పర్వతాలలో మేరువు అతడే. పురోహితులలో బృహస్పతి, సేనానాయకులలో కుమారస్వామి, సరస్సులలో సముద్రం అతడే. మహర్షులలో భృగుమహర్షి, వాక్కులలో ఏకాక్షరమయిన ఓంకారం, యజ్ఞాలలో జపయజ్ఞం, స్థావరములలో హిమాలయం అతడే.

వృక్షజాతిలో అశ్వత్థం, దేవర్షులలో నారదుడు, గంధర్వులలో చిత్రరథుడు, సిద్ధులలో కపిలమునీంద్రుడు అతడే. గుర్రాలలో అమృత మథన సమయంలో పుట్టిన ఉచ్చైశ్రవసమనే గుఱ్ఱం, ఏనుగులలో ఐరావతం, నరులలో రాజును అతడే. ఆయుధాలలో వజ్రాయుధం, పాడి ఆవులలో కామధేనువు, ప్రజననమునకు కారకుడయిన మన్మథుడు, సర్పాలలో వాసుకి అతడే. నాగులలో అనంతుడు, జలదేవతలలో

వరుణుడు, పితృదేవతలలో ఆర్యమ, శిక్షించే వారిలో యముడు అతడే. అసురులలో ప్రహ్లాదుడు, గణించు వారిలో కాలము, మృగాలలో సింహం, పక్షులలో గరుత్మంతుడు అతడే. వేగవంతులలో వాయువు, ఆయుధపాణులలో శ్రీరాముడు, చేపలలో మొసలి, నదులలో గంగానది అతడే. సామవేదగానాలలో బృహత్సామ, ఛందస్సులలో గాయత్రి, మాసాల్లో మార్గశిరం, ఋతువులలో వసంతం అతడే. సమస్త ప్రాణికోటికి ఆధారభూత మేదియో అదియు పరమాత్మయే. జయములలో నీతితో గూడిన జయమే అతడు.

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా

తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజో ఉ ంశసంభవమ్.

ఈ ప్రపంచంలో ఐశ్వర్య యుక్తమయినది, కాంతివంతమయినది, ఉత్సాహవంతమయినది అయిన వస్తువుగాని, ప్రాణిగాని ఆ సర్వేశ్వరుని తేజస్సులోని అంశాలుగా భావించవలె. విశ్వశ్రేయస్సు దృష్టిగా రచన చేసే కవులు, దివ్యకళామయుని అనేకరీతుల భావించే కళాకారులు, సామాజిక సేవ చేసే మహాపురుషులు అందరు స్వామి తేజోంశజులే.

ఈ క్రిందివారు వేదాన్తభేరికి పోషక చందా పంపినారు

1. మార్గం ఆనంద్ (ఎన్.ఎం.రోడ్డు, ముంబాయి) - రూ.2500/-
2. స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (శ్రీకాళహస్తి) - రూ.2116/-
3. స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (శ్రీకాళహస్తి) - రూ.2116/-
4. స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (శ్రీకాళహస్తి) - రూ.2116/-
5. ప్రభుత్వ స్త్రీల డిగ్రీ కళాశాల (శ్రీకాళహస్తి) - రూ.2116/-
6. టి.ఎస్.గౌతమ బుద్ధ (కూకట్‌పల్లి, హైద్రాబాద్) - రూ. 1500/-

వార్తలు

(01). జూన్ 22వ తేది ఉదయం10గం॥ 17 నిమిషాలకు హైద్రాబాద్ సమీపం హయత్‌నగరం మండలం అనుమల్ గ్రామం (తొర్రూర్ రోడ్డు)లోని శ్రీ పార్వతీపరమేశ్వర దేవాలయ ప్రాంగణంలో శ్రీ బెళిగిని కోటయ్యగారు తమ గురుదేవులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిపేరిట నిర్మించిన వేదపాఠశాల భవనాన్ని పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు ఉద్ఘాటన చేశారు. చాలామంది పురప్రముఖులు, వేదపండితులు, విద్వాంసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతర సభలో శ్రీస్వాములవారు తమ అనుగ్రహభాషణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశుకబ్రహ్మాశ్రమ ఉత్తరపీఠాధిపతులు పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు కూడ పాల్గొన్నారు.

(02). చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి మండలం, ముచ్చివోలు గ్రామంలో దాదాపు రెండుకోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీవిజయ గణపతి దేవస్థాన ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా 30-6-2018 తేది ఉదయం 7 గంటలకు పూజ్యశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు ప్రతిష్ఠాకార్యక్రమాలకు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభోత్సవం చేశారు. తరువాత సదస్సులో అనుగ్రహ భాషణ చేశారు.

(03). కడపజిల్లా, గండిక్షేత్రం శ్రీభూమానందాశ్రమంలో సద్గురు పూజ్యశ్రీ రామకృష్ణానందస్వాములవారి 103వ జయన్తి కార్యక్రమంలో జూలై 13,14 తేదీలందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(04). పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో జూలై 23 తేదీలలో శ్రీమలయాళస్వామి గీతాసమాజంవారు, మాతృశ్రీ అనసూయమ్మగారి ఆధ్వర్యంలోజరిపిన పరమ పూజ్యశ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారి56వ ఆరాధనోత్సవాలలో పూజ్యశ్రీవిద్యా స్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని తమ ప్రవచనలను చేశారు. ఈకార్యక్రమంలో అష్టలక్ష్మి పీఠాధిపతులు పూజ్యశ్రీ దండినిర్మలానందగిరిస్వాములవారు (తెనాలి), గవిమఠం ఉత్తరపీఠాధిపతి పూజ్యశ్రీ డా॥ శ్రీ కరిబసవరాజేంద్రస్వాములవారు (ఉరవకొండ) మొదలగు స్వామీజీలు పాల్గొని తమ ప్రవచనలను చేశారు.

(05).30-6-2018 తేది సద్గురు సర్వసేవాట్రస్టు బోర్డు సమావేశం శ్రీశుకబ్రహ్మాశ్రమం శ్రీకాళహస్తిలో జరిగినది.

(06). ఆశ్రమ కంటిఆసుపత్రిలో జూన్ నెలలో ఓ.పి.లో **1197** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేశారు. **104** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చారు. **14** మందికి యాగ్ లేజర్ చికిత్స చేశారు.